మృత్యుతీగల కింద ఇంకెన్నాళ్లు

- ఎల్లారెడ్డిగూడ వడ్డెర బస్తీ వాసులను భయపెడుతున్న హైటెన్షన్ వైర్లు
- విద్యుత్ తీగ తెగిపడటంతో గతంలో మహిళ మృతి
- శనివారం మరోసారి తెగిపడిన వైరు
- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

బంజారాహిల్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హైటెన్షన్ వైర్లతో తరచూ ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఉదయం ఎల్లారెడ్డిగూడ వడ్డెర బస్తీలో ఉన్న ప్రభుత్వ పాఠశాల వద్ద హైటెన్షన్ వైరు తెగిపడింది. ఆ సమయంలో అక్కడ బట్టలు ఆరేస్తున్న యాదమ్మకు విద్యుత్ షాక్ తగిలింది. కొన్ని ఇళ్లలో గృహోపకరణాలు పాడయ్యాయి. ప్రాణభయంతో ఇళ్లనుంచి బయటకు వచ్చిన బస్తీ వాసులు విద్యార్థులు అటువైపు వెళ్లకుండా ఆపడంతో పెనుప్రమాదం తప్పింది. గత ఏడాది మార్చిలో ఇదే బస్తీకి చెందిన ఎత్తరి మనీలా ఇంట్లో పనిచేసుకుంటుండగా 34కేవీ హైటెన్షన్ వైర్ ఒక్కసారిగా తెగిపడటంతో ఆమె విద్యుత్ షాక్‌కు గురై 32 రోజుల పాటు చికిత్స అనంతరం మృతిచెందింది.

ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట బైఠాయింపు

ఇలా తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ట్రాన్స్‌కో అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయంతో బతుకుతున్నామని బస్తీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా శనివారం మరోసారి విద్యుత్ తీగలు తెగిపడిన క్రమంలో బస్తీ వాసులు శ్రీనగర్‌కాలనీ ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట బైఠాయించారు. హై టెన్షన్ వైర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. స్థానిక కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్ దంపతులు సైతం వారికి మద్దతుగా కార్యాలయం ఎదుట బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఏడీఈ అక్కడకు రావడంతో వెంటనే సమస్యను పరిష్కరించాలని, అవసరమైతే తాను నిధులు ఇస్తానని కార్పొరేటర్ పేర్కొన్నారు.

ప్రమాదం అంచున 300 కుటుంబాలు..

ఎల్లారెడ్డిగూడలో హై టెన్షన్ వైర్ల సమస్య చాలా కాలంగా ఇబ్బంది పెడుతోంది. గత ప్రభుత్వంలో హై టెన్షన్ వైర్ల తరలింపు చేపట్టినప్పటికీ వడ్డెర బస్తీలో మాత్రం తొలగించలేదు. బస్తీలో వైర్ల కింద సుమారు 300 కుటుంబాలు నివాసముంటున్నాయి. రెండేళ్ల క్రితం ఇళ్లలో టీవీలు, ఫ్రిడ్జ్‌లు పాడవడంతో వాటిని రోడ్లపై పెట్టి నిరసన వ్యక్తం చేశారు. మనీలా మృతి చెందినప్పుడు సైతం పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. అయితే అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



స్థానికులతో కలిసి ధర్నా చేస్తున్న సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్ దంపతులు

ప్రాణం పోయిందనుకున్నా



ఇంటి బయట బట్టలు ఆరేస్తున్నా. ఇంతలో పెద్ద తీగ వచ్చి నా పక్క నుంచి వెళ్లింది. షాక్ తగలడంతో ప్రాణం పోయిందనుకున్నా. తీగ నామీద పడి ఉంటే బుగ్గి అయిపోయేదాన్ని. అధికారులు ఇప్పటికైనా స్పందించి మా ప్రాణాలు కాపాడాలి.

- యాదమ్మ, షాక్‌కు గురైన మహిళ

ఇంకెన్ని చావులు చూడాలి



హై టెన్షన్ వైర్ల కారణంగా మా తల్లిని పోగొట్టుకున్నాం. అయినా అధికారుల్లో, ప్రజాప్రతినిధుల్లో చలనం లేదు. ఇంకా ఎంత మంది చావులు చూడాల్సి వస్తుందోనని భయమేస్తోంది. రాత్రి ఇంట్లో ప్రశాంతంగా పడుకొని ఏడాది అవుతోంది. ఎప్పుడు ఏ తీగ వచ్చిపడుతుందో అనే భయం వెంటాడుతుంది.

- నరేష్, మృతిచెందిన మనీలా కుమారుడు

నిధులు కేటాయిస్తా



వడ్డెర బస్తీలో హైటెన్షన్ వైర్ల సమస్య ఇప్పటిది కాదు. అన్ని చోట్లా వైర్లను తరలించిన అధికారులు వడ్డెర బస్తీ విషయంలో మాత్రం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. గతేడాది ఒకరు చనిపోగా, ఇప్పుడు తృటిలో ప్రమాదం తప్పింది. ఈ విషయాన్ని త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తాం. సమస్య పరిష్కారానికి కార్పొరేటర్ నిధులు ఇస్తా.

- వనం సంగీతాయాదవ్, సోమాజిగూడ కార్పొరేటర్



ముందడుగు యాప్‌ను ఆవిష్కరిస్తున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

సమస్యల పరిష్కారానికి 'ముందడుగు' యాప్

పంజాగుట్ట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ ప్రాంతంలోని సమస్యలను, అవినీతిని సమాజానికి తెలపాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సూచించారు. శుక్రవారం ఎర్రమంజిల్ కాలనీలోని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముందడుగు యాప్‌ను ఆవిష్కరించారు. సమాజంలో జరుగుతున్న అవినీతి,ప్రజల సమస్యలు, నిజాయతీ గల వ్యక్తులకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేసేందుకు ముందడుగు యాప్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు రాజేంద్ర.పి, ముందడుగు సభ్యులు కె.దేవేందర్, జంగయ్య, రమేశ్ బాబు, గంగాధర్, గితానంద్ తదితరులు పాల్గొన్నారు.

7, 8 తేదీల్లో జాతీయ సదస్సు

బేగంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఏఐ) ఆధ్వర్యంలో ఫైర్, ఎలక్ట్రికల్, సెక్యూరిటీ అండ్ ఆటోమేషన్(ఫెసా-2024) పేరిట ఈ నెల 7, 8 తేదీల్లో మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌ఎస్‌ఏఐ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ వల్లూరి తెలిపారు. శనివారం బేగంపేటలోని హరితా ప్లాజా హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదస్సు వివరాలను ఆయన వెల్లడించారు. పరిశ్రమల్లో చోటుచేసుకుంటున్న అగ్నిప్రమాదాలు నేపథ్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు ప్రసాద్ నిష్టల, సౌత్ రీజనల్ డైరెక్టర్ ప్రసాద్‌రాజు, చైర్మన్ మనోజ్ బాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.



స్ట్రోక్ బాధితుడితో ఆస్పత్రి వైద్యులు

స్ట్రోక్ లక్షణాలపై అవగాహన

అమీర్‌పేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినప్పుడు మెదడులో రక్తప్రసరణ నిలిచిపోయి శరీరంలోని ఏదో ఒక భాగం చనిపోతుందని ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రికి చెందిన స్ట్రోక్ స్పెషలిస్టు డాక్టర్ అనిరుధ్‌రావు దేశ్‌ముఖ్ పేర్కొన్నారు. ప్రపంచ స్ట్రోక్ డేను పురస్కరించుకుని శనివారం అమీర్‌పేట ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రిలో స్ట్రోక్ లక్షణాలను గుర్తించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్ట్రోక్ మూలంగా ప్రధానంగా కంటి చూపు పోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, మూతి వంకర పోవడం, మాట తగ్గిపోవడం, నడవలేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయన్నారు. స్ట్రోక్ వచ్చిన మూడు గంటల్లోగా వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలని సూచించారు.



హైదరాబాద్ జిల్లా ఖోఖో జట్టుకు ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు గోపాల్

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు రాజ్‌భవన్ స్కూల్ విద్యార్థులు

బేగంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా ఖోఖో జట్టుకు రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు గోపాల్ తెలిపారు. అండర్ 14 బాలికలలో 8వ తరగతికి చెందిన అనుప్రియ.. బాలురలలో మినిష్‌రాజ్, జస్వంత్.. అండర్ 17 బాలురలో 9వ తరగతికి చెందిన రామ్‌చరణ్ ఎంపికయ్యారన్నారు. వీరంతా జోనల్, మండల్ స్థాయిల్లో విజయం సాధించి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయిలో ఖోఖో పోటీలలో హైదరాబాద్ జిల్లా తరపున వారు ఆడనున్నట్లు తెలిపారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ముగిసిన చెఫ్ డే వారోత్సవాలు

బంజారాహిల్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ చెఫ్ డేను పురస్కరించుకొని బంజారాహిల్స్‌లోని రీజెన్సీ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. వారం రోజుల పాటు నిర్వహించిన సాంస్కృతి, సామాజిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. వ్యాసరచన, పోస్టర్ మేకింగ్ పోటీలు, రక్తదానం, ఆహార భద్రతపై శిక్షణ, దివ్యాంగులకు అన్నదానం, జీరో హంగర్ డ్రైవ్‌పేరుతో ప్రముఖ ఆస్పత్రుల్లో అన్నదానం చేసినట్లు తెలిపారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

బంజారాహిల్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసం, పెద్దమ్మతల్లి దేవాలయం చుట్టూ ఉన్న రోడ్ల ఫుట్‌పాత్ ఆక్రమణలపై పోలీసులు దృష్టి సారించారు. సీఎం వెళ్లే మార్గంలో ప్రతి నిత్యం ట్రాఫిక్ జాం ఏర్పడుతుండటంతో పాటు పెద్దమ్మతల్లి ఆలయం వద్ద ట్రాఫిక్ సమస్య పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో పశ్చిమ మండలం ఏసీపీ హరిప్రసాద్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ పోలీసులు శనివారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఆక్రమణలను తొలగించారు. కొంత మంది షోరూంల నిర్వాహకులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ర్యాంప్‌లు, పార్కింగ్‌లు ఏర్పాటు చేయడంతో వాటిని తొలగించాలని హెచ్చరించారు. పెద్దమ్మ తల్లి దేవాలయం లోపల పార్కింగ్ స్లాట్ నిండిపోతే ఆలయం వెనుక భాగంలో ఉన్న నాలా వద్ద ఖాళీ స్థలంలో వాహనాలను నిలపాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు త్వరలోనే ఆలయ సిబ్బందితో చర్చించనున్నట్లు ఏసీపీ వెల్లడించారు. ఈ స్పెషల్ డ్రైవ్ నిత్యం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.



జూబ్లీహిల్స్‌లో ఫుట్‌పాత్‌లను పరిశీలిస్తున్న పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

కుటుంబ సర్వేపై సిబ్బందికి శిక్షణ

యూసుఫ్‌గూడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఈ మేరకు శనివారం యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ సర్కిల్-19 డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, డీపీఓ వెంకట్ కిషన్‌రావు పర్యవేక్షణలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వెంగళరావునగర్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యామిలీ వెల్ఫేర్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, రిసోర్స్ పర్సన్లు, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆశా వర్కర్‌లు, ప్రవేట్ టీచర్‌లు పాల్గొన్నారు. సర్వేలో ఒక్కో సూపర్‌వైజర్ పది మంది ఎన్యూమరేటర్‌లను పర్యవేక్షించాల్సి ఉంటుందని, ఒక్కో ఎన్యూమరేటర్ 150 ఇళ్లను సందర్శించాల్సి ఉంటుందని వారు తెలిపారు. సర్వే చేసేటప్పుడు ఎలాంటి పొరపాట్లు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా

ఖైరతాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఖైరతాబాద్ సర్కిల్‌లో 438, జూబ్లీహిల్స్ సర్కిల్‌లో 422 ఎన్యూమరేటర్ బ్లాకుల్లో సర్వేను నిర్వహించనున్నారు. ఈ మేరకు సర్వేలో పాల్గొనే సిబ్బందికి సోమవారం శిక్షణ ఇవ్వనున్నారు. 6వ తేదీ నుంచి సర్వే ప్రారంభం కానున్న నేపథ్యంలో తొలి మూడు రోజులు ఇళ్లను గుర్తించి సీరియల్ నంబర్లతో కూడిన స్టిక్కర్లను అంటిస్తారని.. 9 నుంచి వివరాలు సేకరిస్తారని ఖైరతాబాద్ సర్కిల్ ఉప కమిషనర్ రజనీకాంత్ తెలిపారు.

మ్యారేజ్ బ్యూరో ముసుగులో వ్యభిచారం

- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

ఖైరతాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మ్యారేజ్ బ్యూరో ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ముఠాను సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖైరతాబాద్ షాదన్ కళాశాల సమీపంలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడిచేసి ఓ మహిళను, నలుగురు విటులను అదుపులోకి తీసుకోవడంతో పాటు నలుగురు మహిళలను కాపాడారు. నిందితులను ఖైరతాబాద్ పోలీసులకు అప్పగించారు. రూ.2,800 నగదు, కండోమ్స్, 9 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర తెలిపారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో వ్యాపారం నిర్వహిస్తూ విటులను ఆకర్షిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో నిందితులు

మెడికల్ సీటు పేరుతో మోసం

- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

పంజాగుట్ట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెడికల్ సీటు ఇప్పిస్తానంటూ డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిని పంజాగుట్ట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్వారకాపురి కాలనీకి చెందిన విజయ మెడిసిన్ లో సీటు కోసం లక్డీకపూల్ వినాయక్‌నగర్‌లో ఉంటున్న ఏపీలోని రాజమండ్రికి చెందిన బత్తుల శ్యామ్ ప్రసాద్(33)ను సంప్రదించింది. సీటు కోసం ఆమె 2022 అక్టోబరులో రూ.1.18 లక్షలు ఇచ్చింది. అయితే సీటు ఇప్పించకుండా మోసం చేయడంతో 2023 జనవరిలో పంజాగుట్ట పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు శ్యామ్‌ప్రసాద్‌ను శనివారం అరెస్ట్ చేశారు.



బత్తుల శ్యామ్‌ప్రసాద్



సదర్ ఉత్సవాల్లో భాగంగా ఖైరతాబాద్ నుంచి నారాయణగుడకు వెళ్తున్న ఊరేగింపులో పాల్గొన్న కార్పొరేటర్ విజయారెడ్డి, నిర్వాహకులు త్రినయ్ యాదవ్, మహేష్ యాదవ్ తదితరులు

- ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి



శుక్రవారం అర్ధరాత్రి ఖైరతాబాద్ సదర్‌లో సందడి చేసిన సైఫాబాద్ డివిజన్ ఏసీపీ సంజయ్‌కుమార్ తదితరులు

- ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్ తదితరులు

కులగణనతో అన్ని వర్గాలకూ సమన్యాయం

- ఎంపీ సురేష్ శెట్కార్

పంజాగుట్ట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కులగణన ద్వారా అన్ని వర్గాలకు సమన్యాయం లభిస్తుందని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కార్ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర వీరశైవ లింగాయత్-లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో కులగణనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 6 నుంచి జరగనున్న సమగ్ర కులగణన కోసం వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని సూచించారు. అన్యాయాలను సరిచేసేందుకే రాహుల్ గాంధీ దేశవ్యాప్త కులగణన జరగాలని కోరుకున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు దినేష్ పాటిల్, హన్మంతరావు పాటిల్, శెట్టి శివకుమార్, రాచప్ప, శివ శరణ్, మధు, రఘు, రాకేష్, మహేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులపై దురుసు ప్రవర్తన.. కేసు నమోదు

బంజారాహిల్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరకకుండా తప్పించుకునేందుకు సీటు మారిన యువకుడిని అడ్డుకున్న హోంగార్డుపై దాడి చేసి సెల్‌ఫోన్ పగులగొట్టిన ఘటన బంజారాహిల్స్‌లో చోటుచేసుకుంది. మారెడ్‌పల్లికి చెందిన పర్మార్ సిద్దార్థ తన స్నేహితులైన శేషసాయిప్రసాద్ అలియాస్ కిట్టు, హరిత, దశమి, పావనిలతో కలిసి కారులో శుక్రవారం రాత్రి జూబ్లీహిల్స్ క్లబ్‌రోగ్ పబ్‌కు వచ్చాడు. పార్టీ ముగించుకొని అర్ధరాత్రి వెళ్తున్న సమయంలో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నట్టు గమనించారు. వెంటనే మద్యం తాగి ఉన్న సిద్దార్థ తన డ్రైవింగ్ సీటును హరితకు ఇచ్చాడు. ఈ విషయంలో శేషసాయిప్రసాద్ ట్రాఫిక్ పోలీసుల పట్ల దురుసుగా వ్యవహరించాడు. ఎస్ఐ గోవర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు శేషసాయిప్రసాద్, సిద్దార్థ్ తదితరులపై కేసు నమోదు చేశారు.

రెట్టింపు ఆదాయం పేరుతో లూటీ

బంజారాహిల్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వెబ్‌సైట్ ద్వారా సర్వర్ కొనుగోలు చేస్తే రెట్టింపు ఆదాయం వస్తుందని చెప్పిన సైబర్ నేరగాళ్లు కాంట్రాక్టర్‌ను మోసం చేశారు. బంజారాహిల్స్‌కు చెందిన పవన్‌కుమార్ వాట్సా‌ప్‌కు ఓ లింక్ వచ్చింది. దాని ద్వారా సర్వర్ కొనుగోలు చేస్తే మంచి ఆదాయం వస్తుందని గత జూన్‌లో రూ.18,500 చెల్లించాడు. మరో రెండు రోజుల తరువాత ఆ డబ్బు రూ.37,000 అయినట్టు వెబ్‌సైట్‌లో కనిపించడంతో మరో రూ.12,300 కట్టాడు. ఈ తర్వాత డబ్బు విత్‌డ్రా కాకపోవడంతో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలునుంచి జారిపడి వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడిన వ్యక్తి మృతిచెందిన ఘటన బొల్లారం రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నారాయణ కేతావత్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని 35 ఏళ్ల వ్యక్తి మృతదేహం రైలు పట్టాల పక్కన పడి ఉంది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

వాటర్‌బోర్డులో ఉద్యోగులకు పదోన్నతి

హైదరాబాద్ సిటీ, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): వాటర్ బోర్డులో తొమ్మిది మంది ఉద్యోగులకు పదోన్నతి లభించింది. బోర్డులో జనరల్ పర్పస్ ఉద్యోగులు(జీపీఈ)గా పనిచేస్తున్న తొమ్మిది మందికి అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. వీరిలో ఏడుగురి అసిస్టెంట్లను ఎఫ్‌అండ్‌ఏ, ఇద్దరి అసిస్టెంట్లను పీ అండ్ ఏ విభాగానికి కేటాయించారు. ఈ మేరకు ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్‌రెడ్డి వీరికి నియామకపత్రాలు అందజేసి అభినందించారు.

ఐదుగురికి కారుణ్య నియామకం

వాటర్ బోర్డులో ఐదుగురికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు లభించాయి. బోర్డులో విధులు నిర్వర్తిస్తూ ఉండగానే మరణించిన ఐదుగురు ఉద్యోగుల వారసులకు.. వారి వారి విద్యార్హతల ఆధారంగా కారుణ్య నియామకం కింద ఉపాధి కల్పిస్తూ ఎండీ అశోక్‌రెడ్డి నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్, సుదర్శన్, సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

'షిరిడీ సాయిబాబాపై అసత్య ప్రచారం తగదు'

ఖైరతాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): షిరిడీ సాయిబాబాపై కొందరు అసత్య ప్రచారం చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని షిరిడీ సాయి విశ్వ సమాజ్ వ్యవస్థాపకుడు మైనంపాటి ప్రసాద్ అన్నారు. శనివారం సోమాజిగుడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. షిరిడీ సాయి సంస్థాన్ ట్రస్టు నిధులను మహారాష్ట్ర ప్రభుత్వమే ఖర్చు పెడుతుందని, నిధుల వినియోగం కోసం కలెక్టర్ స్థాయి అధికారి ఉంటారన్నారు. కేవలం ఒక వర్గానికే ఆ నిధులు వెళ్లాయనడంలో ఎలాంటి వాస్తవం లేదని ఆయన పేర్కొన్నారు.



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



రాధాగోవిందుల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ నిర్వాహకులు

వైభవంగా కార్తీకమాసం పూజలు

బంజారాహిల్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పూజలు శనివారం వైభవంగా మొదలయ్యాయి. శివాలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలు వెలిగించేందుకు వచ్చిన భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. శ్రీనగర్‌కాలనీ వెంకటేశ్వర, భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 12న సామూహిక బిల్వార్చన, 15న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా గోవర్ధన పూజ

బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని లక్ష్మీనర్సింహస్వామి(స్వర్ణ) దేవాలయంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం గోవర్ధన పూజ, కార్తిక దీపోత్సవాలను నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాధాకృష్ణులకు అన్నకూటమి పేరిట 350 కిలోల ఆహార పదార్థాలతో నైవేద్యాలను సమర్పించారు. ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. సాయంత్రం కార్తీక దీపోత్సవంలో భాగంగా యశోదా దామోదర్‌కు మహా హారతి ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి ఊరేగింపు కార్యక్రమాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడును అభినందిస్తున్న టీడీపీ ఖైరతాబాద్ నియోజకవర్గం నాయకులు బాలాజీగోస్వామి, నర్సింహులు తదితరులు

- బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి



టీటీడీ చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో స్పెక్ట్రం పబ్లికేషన్స్ డైరెక్టర్ మోహన్‌నాయుడు కలిసి తిరుమలలో ఉన్న పలు విద్యాసంస్థల కోసం రూ.13 లక్షల విలువైన పుస్తకాలను అందజేశారు.

- సనత్‌నగర్, ఆంధ్రజ్యోతి

నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

హైదరాబాద్ సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్ల పరిధిలో ఆదివారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఖైరతాబాద్, కూకట్‌పల్లిలోని మెట్రో, రంగారెడ్డి సీఈ కార్యాలయాలతో పాటు డివిజన్ కార్యాలయాల్లో వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కొండాపూర్, గచ్చిబౌలి డివిజన్ పరిధిలో ఉన్న వినియోదారుల సమస్యల పరిష్కారానికి ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేపీహెచ్‌బీ సబ్‌స్టేషన్ ఆవరణలోని విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. వినియోగదారులకు ఎలాంటి సమస్యలున్నా అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని మెట్రో, రంగారెడ్డి జోన్ల సీఈలు చక్రపాణి, పాండ్యనాయక్, హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ ఎస్ఈ వెంకన్న తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి

తార్నాక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతిచెందిన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఓయూ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన మారుపాక రోహిత(25) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. తార్నాకలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో తన సోదరి హర్షితతో కలిసి ఉంటుంది. డ్యూటీ నిమిత్తం ఉదయం 10 గంటలకు తార్నాక నుంచి హబ్సిగూడ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా తార్నాకలోని స్మార్ట్‌బజార్ వద్ద వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ఆమె బస్సు ముందు చక్రం కింద పడటంతో తీవ్ర రక్తస్రావంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ఓయూ పీఎస్‌కు తీసుకువెళ్లారు. బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

7, 8 తేదీల్లో జాతీయ సదస్సు

బేగంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఏఐ) ఆధ్వర్యంలో ఫైర్, ఎలక్ట్రికల్, సెక్యూరిటీ అండ్ ఆటోమేషన్(ఫెసా-2024) పేరిట ఈ నెల 7, 8 తేదీల్లో మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో జాతీయస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎఫ్ఎస్ఏఐ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ వల్లూరి తెలిపారు. శనివారం బేగంపేటలోని హరిత ప్లాజా హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదస్సు వివరాలను ఆయన వెల్లడించారు. పరిశ్రమల్లో చోటుచేసుకుంటున్న అగ్నిప్రమాదాలు నేపథ్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు ప్రసాద్ నిష్టల, సౌత్ రీజనల్ డైరెక్టర్ ప్రసాద్‌రాజు, చైర్మన్ మనోజ్ బాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.


స్ట్రోక్ బాధితుడితో ఆస్పత్రి వైద్యులు

స్ట్రోక్ లక్షణాలపై అవగాహన

అమీర్‌పేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినప్పుడు మెదడులో రక్తప్రసరణ నిలిచిపోయి శరీరంలోని ఏదో ఒక భాగం చచ్చుబడుతుందని ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రికి చెందిన స్ట్రోక్ స్పెషలిస్టు డాక్టర్ అనిరుధ్‌రావు దేశ్‌ముఖ్ పేర్కొన్నారు. ప్రపంచ స్ట్రోక్ డే ను పురస్కరించుకుని శనివారం అమీర్‌పేట ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రిలో స్ట్రోక్ లక్షణాలను గుర్తించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్ట్రోక్ మూలంగా ప్రధానంగా కంటి చూపు పోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, మూతి వంకర పోవడం, మాట తగ్గిపోవడం, నడవలేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయన్నారు. స్ట్రోక్ వచ్చిన మూడు గంటల్లోగా వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలని సూచించారు.



హైదరాబాద్ జిల్లా కోకో జట్టుకు ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు గోపాల్

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు రాజ్‌భవన్ స్కూల్ విద్యార్థులు

బేగంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా కోకో జట్టుకు రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు గోపాల్ తెలిపారు. అండర్ 14 బాలికలలో 8వ తరగతికి చెందిన అనుప్రియ.. బాలురలలో మినిష్‌రాజ్, జస్వంత్.. అండర్ 17 బాలురలో 9వ తరగతికి చెందిన రామ్‌చరణ్ ఎంపికయ్యారన్నారు. వీరంతా జోనల్, మండల్ స్థాయిల్లో విజయం సాధించి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయిలో ఖోఖో పోటీలలో హైదరాబాద్ జిల్లా తరపున వారు ఆడనున్నట్లు తెలిపారు.


టీటీడీ చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో స్పెక్ట్రం పబ్లికేషన్స్ డైరెక్టర్ మోహన్ నాయుడు కలిశారు. ఈ సందర్భంగా తిరుమలలో ఉన్న పలు విద్యాసంస్థల కోసం రూ.13 లక్షల విలువైన పుస్తకాలను అందజేశారు.

- సనత్‌నగర్, ఆంధ్రజ్యోతి


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న శ్రీగణేష్

పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడుపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యత కల్పిస్తోందని కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందిన 8మంది లబ్ధిదారులకు శనివారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

రైలునుంచి జారిపడి వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడిన ఓ వ్యక్తి మరణించిన ఘటన బొల్లారం రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నారాయణ కేతావత్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని 35 ఏళ్ల వ్యక్తి రైలు పట్టాల పక్కన చనిపోయి ఉన్నాడని సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ దారి యమడేంజర్!

● బొల్లారం రైతు బజార్ వద్ద వాహనాల రద్దీ ● ట్రాఫిక్ నియంత్రణ లేక వాహనదారుల పాట్లు ● నిత్యకృత్యంగా మారిన రోడ్డు ప్రమాదాలు

తిరుమలగిరి నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారి గుండా ఉత్తర తెలంగాణ జిల్లాలకు నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జూబ్లీ బస్ స్టేషన్ నుండి నిత్యం వందలాది బస్సులు ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు చేరవేస్తుంటారు. రాత్రీపగలు తేడా లేకుండా వాహనాలు తిరుగుతూ ఉంటాయి. అయితే బొల్లారం రైతు బజార్ వద్దకు రాగానే వాహనదారులు ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని వాహనాలను నడపాల్సిన పరిస్థితి. ఒక పక్క రైతు బజారు, మరో పక్క పెట్రోల్ బంకు, ఇంకో వైపు ఆసుపత్రి ఉంది. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపులా తుర్కపల్లి, గజ్వేల్, వంటిమామిడి, ములుగు తదితర గ్రామాలకు చెందిన రైతులు, మహిళా కూలీలు గ్రామాల నుంచి తీసుకొచ్చిన పండ్లు, పూలు రోడ్డుకు ఇరువైపులా కూర్చుంటూ విక్రయాలు కొనసాగిస్తుంటారు. అయితే కొనుగోలు చేయడానికి వచ్చిన పౌరులతో ఆ ప్రాంతం అంతా గజిబిజిగా ఉంటోంది. రోడ్డు ప్రమాదాలు కూడా అధికంగా జరుగుతుంటాయి. ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో పాటు అధికంగా అతివేగంగా వాహనాలు వెల్లడంతో ఆ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరగడం నిత్యకృత్యమయింది. అయితే రెండు మూడు రోజుల క్రితం యాప్రాల్ బాపూజీ నగర్ కు చెందిన కూరగాయల వ్యాపారి భార్య భర్తలు ఇద్దరూ కూరగాయలు తీసుకుని తమ యాక్టీవాపై ఇంటికి తిరుగుముఖం పట్టారు. రైతు బజార్ నుంచి బయటకు వచ్చి పెట్రోల్ బంకు వద్ద యూ టర్న్ తీసుకుని ఇంటికి వెళ్తుండగా వేగంగా వచ్చిన ఇసుక లారీ యాక్టీవాను ఢీకొట్టింది దీంతో కూరగాయల వ్యాపారి ఇసుక లారీ చక్రాల కింద పడి నుజ్జు నుజ్జు అయ్యి అక్కడికక్కడే భార్య కళ్లెదుటే మృతి చెందాడు. భార్య దూరంగా ఎగిరిపడి ఆమె ఎడమ కాలు విరిగి పోయింది. ఇలాంటి ఘటనలు గతంలో ఎన్ని జరిగినా.. అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజీవ్ రహదారి గుండా అధిక సంఖ్యలో వాహనాలు వేగంగా వెళ్తున్న నేపథ్యంలో రైతు బజార్ వద్ద ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతు బజార్ కు కూరగాయలు కొనుగోలు చేయడానికి అల్వాల్, తిరుమలగిరి, లాల్‌బజార్, మచ్చ బొల్లారం, బొల్లారం ప్రాంతాల నుంచి కూరగాయలు కొనడానికి అధిక సంఖ్యలో వస్తుంటారు. కొనుగోలు చేయడానికి వెళ్లాలంటేనే పలువురు జంకుతున్నారు.


రైతు బజార్ వద్ద ప్రమాదకరంగా మారిన రోడ్డు

స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి



బొల్లారం రైతు బజార్ నుంచి ప్రయాణం చేయాలంటేనే భయం భయంగా ఉంది. ఏ వాహనం ఎక్కడి నుంచి వచ్చి ఢీ కొడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు ఉండాలి. దాంతో పాటు స్పీడ్ బ్రేకర్లు కూడా వేయాలి.

-రాజారెడ్డి (తిరుమలగిరి వాసి)

రోడ్డు ఇరుకుగా ఉంది



బొల్లారం రైతు బజార్ వద్ద రోడ్డు ఇరుకుగా ఉంది. ఆ రోడ్డును రోడ్లు భవనాల శాఖ అధికారులు అభివృద్ధి చేయాలి. మా వంతు కృషిలో భాగంగా రైతు బజార్ వద్ద బొల్లార్డ్స్ ఫిక్స్ చేస్తాం. వేగ నియంత్రణకు బారీకేడ్లు ఏర్పాటు చేస్తున్నాం. రాజీవ్ రహదారిలో మా పరిధిలో ఎక్కడ కూడా ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు చేపడుతున్నాం.

- తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు

అనుబంధాలను నెమరువేసుకుంటూ..


సమాధుల వద్ద ప్రార్థన చేస్తున్న నన్స్

చిలకలగూడ, పద్మారావునగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ ఆలుగడ్డబావి క్రైస్తవ శ్మశానవాటికలో మంగళవారం క్రైస్తవులు మరణించిన వారి ఆత్మలకి శాంతి చేకూరాలని 'ఆల్‌సోల్స్ డే' ను విషాద వదనాలతో నిర్వహించారు. సమాధులను శుభ్రపరిచి పూలు, కొవొత్తులు వెలిగించి మరణించిన వారికి ఇష్టమైనవి ఉంచి వారితో గల అనుబంధాలను గుర్తుచేసుకున్నారు. శ్మశానవాటిక పరిసరాలన్నీ విషాద ఛాయలు నెలకున్నాయి. అనంతరం చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బోయగూడ క్రైస్తవ శ్మశానవాటికలో...

బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి బోయగూడలోని వివిధ క్యాథలిక్, ప్రొటెస్టెంట్ క్రైస్తవ శ్మశానవాటికలలో తమ కుటుంబంలో మృతి చెందిన వారి ఆత్మల శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవ కుటుంబాలతో శ్మశానవాటిక కిక్కిరిసిపోగా, కొవ్వొత్తుల వెలుగులతో శ్మశానవాటిక ధగధగలాడింది. బోయగుడా పరిసర ప్రాంతాలు పూల, కొవ్వొత్తుల తోపుడు బండ్లతో రోడ్లు నిండిపోవడంతో ప్రధాన రహదారిలో వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహించారు.

శ్మశానవాటికను సందర్శించిన తలసాని

బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయగూడలోని క్యాథలిక్ క్రైస్తవ శ్మశానవాటికలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రేవ్ యార్డులోని చర్చ్‌లో మేరీ మాతకు ప్రార్థనల అనంతరం క్రైస్తవ మత పెద్దలు తలసానిని ఆశీర్వదించారు. శ్మశానవాటికకు వచ్చిన వారికి జ్యూస్, వాటర్, బిస్కెట్ ప్యాకెట్లను డివిజన్ కార్పొరేటర్ కుర్మ హేమలతతో కలిసి పంపిణీ చేశారు. ఫాదర్ ఆరోగ్యం,గ్రేవ్ యార్డు నిర్వాహకులు విజయ్,జయరాజ్,నాయకులు లక్ష్మీపతి,శ్రీకాంత్ రెడ్డి, రమణ, బాల్‌రెడ్డి, ముక్కాశ్రీను పాల్గొన్నారు.


క్రైస్తవ మత పెద్దలతో తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్ కుర్మ హేమలత

ట్రాన్స్‌జెండర్లకు గాంధీలో ప్రత్యేక విభాగాలు

● సూపరింటెండెంట్ రాజకుమారి

అడ్డగుట్ట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : లింగమార్పిడిదారులకు వైద్యపరంగా సేవలందించేందుకు నూతన విధానాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారి తెలిపారు. శనివారం గాంధీ మెడికల్ కాలేజీలో కంటిన్యూ ప్రొఫెషనల్ (సీపీఓ) కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, లింగమార్పిడిదారుల మనస్తత్వం.. జీవన శైలి వైద్యపరంగా అందించే వైద్య విధానంపై వైద్యుల సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. లింగమార్పిడి చేసుకున్న వారిలో ఉండే అనేక ఆరోగ్య సమస్యలు వివిధ రుగ్మతలకు మెరుగైన వైద్యం అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా తెలంగాణ అన్ని ఆస్పత్రుల్లో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఇంద్ర, గాంధీ డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ ప్రభోద్ పాల్గొన్నారు.


కంటిన్యూ ప్రొఫెషనల్ కార్యక్రమంలో పాల్గొన్న గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారి, కాలేజీ ప్రిన్సిపాల్ ఇంద్ర

గోవుల దాహార్తి కోసం నీటికుంట

● హనుమాన్ సేవక్ కమిటీ ఆధ్వర్యంలో పునర్‌నిర్మాణం

తిరుమలగిరి నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్ లోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన శ్రీ హనుమాన్ దేవాలయం ముందు కొన్ని సంవత్సరాల క్రితం గోవులు తమ దాహార్తిని తీర్చుకోవడానికి నీటికుంటను ఏర్పాటు చేశారు. అయితే అది శిథిలావస్థకు చెందడంతో హనుమాన్ ఆలయంలో ప్రతీ నెల రెండవ శనివారం హనుమాన్ సేవక్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నీటి కుంటను పునర్నిర్మించి గోవుల దాహార్తిని తీర్చడానికి అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో గో సంరక్షణ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆలయాల్లో భక్తుల సందడి

బౌద్ధనగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభం కావటంతో శనివారం బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్లో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఉన్న శివలింగాలకు భక్తులు పాలుపోసి అభిషేకం చేశారు. బౌద్ధనగర్ రామాలయంలో ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.సీతాఫల్‌మండి రామలింగేశ్వరస్వామి ఆలయంలో లష్కర్‌జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబురావు, శైలేందర్ పాల్గొన్నారు.


రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ దంపతులు

సదర్.. జోర్దార్


బూసారెడ్డి గూడలో ముత్యాలమ్మ ఆలయం వద్ద సదర్ వేడుకల్లో పాల్గొన్న యాదవులు


బొల్లారంలో సదర్ ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని యాదవ సామాజిక వర్గాలకు చెందిన సదర్ ఉత్సవాలు బొల్లారంలో ఘనంగా జరిగాయి. ఉత్సవాలకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, ఎంపీ ఈటల రాజేందర్, తెలంగాణ రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్ రెడ్డి హాజరై యాదవ సంఘానికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పొలం నాగేష్ యాదవ్, జంగాల మురళీ యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలో...

బోయిన్‌పల్లి, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి):సదర్ వేడుకలు బోయిన్‌పల్లి యాదవ సంఘం ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల క్రీడామైదానంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు శ్రీగణేష్, కౌశిక్ రెడ్డి ముఖ్యఅతిధులుగా పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన తీన్మార్ డప్పులు అందరితో డాన్స్‌లు చేయించాయి. ఈ సందర్భంగా యాదవులు దున్నపోతులను అందంగా అలంకరించి వేదిక వద్దకు తీసుకువస్తున్న దృశ్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్, ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, బీఆర్ఎస్ నాయకుడు కర్రె జంగయ్య, సెయింట్ మార్టిన్స్ విద్యాలయాల సెక్రటరీ జయకుమార్ యాదవ్, బీజేపీ నాయకులు బానుక మల్లికార్జున్, బి ఎన్ శ్రీనివాస్, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, డిఐ సర్దార్ నాయక్, ఎస్ఐలు నాగేందర్‌బాబు, గిరిధర్‌లతో పాటు బోయిన్‌పల్లి యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.


సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న జంపన ప్రతాప్

మారేడుపల్లిలో....

మారేడుపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భూసారెడ్డి గూడ శ్రీ ముత్యాలమ్మ ఆలయం వద్ద సీత సన్నీ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవాలకు శ్రీకృష్ణ యాదవ్‌తో పాటు కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు వైష్ణవి పాల్గొన్నారు. డప్పు దరువుల మధ్య అలంకరించిన దున్నపోతులను ఈస్ట్ మారేడుపల్లి వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. విన్యాసాలు చూడడానికి యాదవులు ప్రజలు తరలి వచ్చారు.

ఫిలిప్పీన్స్‌లో సత్తా చూపించారు..

● ముగ్గురు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారే


ఫిలిప్పీన్స్ డ్రాగన్ బోట్ లో అంతర్జాతీయ క్రీడలలో సాధించిన పతకాలతో స్రవంతి ప్రభాకర్, సంజయ్

బోయిన్‌పల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల వాటర్ స్పోర్ట్స్ అకాడమిలో హైదరాబాద్‌కు చెందిన 7వ తరగతి చదువుతున్న స్రవంతి మూడు పతకాలు, ప్రభాకర్ ఒకటి సాధించగా, సంజయ్ ఒక పతకం సాధించి ఫిలిప్పీన్స్‌లో జరుగుతున్న అంతర్జాతీయ డ్రాగన్ బోట్‌లో భారతదేశ పతాకాన్ని రెపరెపలాడిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ అముక్తమాల్యద, హెచ్‌డబ్ల్యూఓ నీలిమ నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ అంతర్జాతీయ డ్రాగన్ బోట్‌లో ఛాంపియన్ షిప్ పోటీలు అక్టోబర్ 31 నుంచి ఫిలిప్పీన్స్ దేశంలో జరుగుతుండగా, ఈ క్రీడలలో 34 దేశాల క్రీడాకారులు పాల్గొంటున్నారు. మనదేశం నుండి 52 మంది విద్యార్థులు పాల్గొనగా... అందులో మన తెలంగాణ రాష్ట్రానికి చెందిన స్రవంతి, ప్రభాకర్, సంజయ్ ఉన్నారు. ఈ క్రీడలలో స్రవంతి 2 కిలోమీటర్లు, 200 మీటర్ల రన్‌లలో రెండు కాంస్య పతకాలు, 500 మీటర్ల రన్‌లో వెండి పతకం సాధించగా, 200 మీటర్ల రన్‌లో ప్రభాకర్, సంజయ్‌లు చెరో కాంస్య పతకాన్ని సాధించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా డీటీడీఓ కోటజీ, స్పోర్ట్స్ అధికారి జ్యోతితో పాటు పలువురు ఉన్నతాధికారులు క్రీడాకారులను విద్యార్థులను అభినందించినట్లు తెలిపారు.


ప్రాథమిక పాఠశాలలో సమస్యలను తెలుసుకుంటున్న టీపీటీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రవీందర్

కులగణన విధులకు సర్‌ప్లస్ టీచర్ల సేవలను వినియోగించాలి

● టీపీటీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రవీందర్

హైదరాబాద్ సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న కులగణన విధులకు సర్‌ప్లస్ టీచర్ల సేవలను వినియోగించుకోవాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ కోరారు. ఈ మేరకు సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం సికింద్రాబాద్‌లోని ఆదయ్య మెమోరియల్, గుండా ఈశ్వరయ్య, న్యూ నల్లగుట్ట, ఓల్డ్ నల్లగుట్ట, కళాసిగూడ, వైఎంసీఏ, కింగ్స్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో పరిష్కారం కాని కొన్ని సమస్యలను ప్రస్తుత సర్కార్ పరిష్కరించడంలో ఉపాధ్యాయ సంఘాల కృషి ఉందన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వెంకటేశ్వరప్రసాద్, బి.రాంబాబు, సికింద్రాబాద్ మండల అధ్యక్షులు జి. సురేష్, పాల్గొన్నారు.


అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ

చింతల్‌బజార్‌లో శ్రీనివాస్‌కు నివాళులు

తిరుమలగిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్ లోని శ్రీ హనుమాన్ దేవాలయం మాజీ చైర్మన్ దివంగత శ్రీనివాస్ ప్రథమ జయంతిని బొల్లారం చింతల్ బజార్‌లో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ బోర్డు సభ్యుడు లోకనాథం, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కే.నరసింహన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ అరవింద్, వినోద్, కర్నాకర్, బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరానగర్‌కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

పైపులైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించండి: హేమ

బౌద్ధనగర్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్‌కాలనీ రోడ్డునెంబర్-9లో శనివారం స్థానిక కార్పొరేటర్ సామల హేమ, అధికారులతో కలిసి పర్యటించారు. మీనా బేకరి గల్లీలో నిరంతరం డ్రైనేజీ పొంగుతుందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని, శాశ్వత పరిష్కారం కొరకు నూతన పైపులైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్‌ను ఆదేశించారు. అనంతరం స్థానిక సమస్యలపై అధికారులు, స్థానికులతో కలిసి చర్చించారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

మారేడుపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ డివిజన్‌లోని కార్ఖానా, జింఖానా, మారేడుపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ల, విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఏడీఈ విజయ్ కుమార్ కోరారు. ఈ మేరకు ఈనెల 3న పికెట్ కేవీఎస్ సమీపంలో గల జింఖానా విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ వినియోగదారులకు సంబంధించిన సదస్సులో సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించి, వాటిని పరిష్కరించనున్నట్లు తెలిపారు. డీఈ సుబ్బారెడ్డితో పాటు సబ్‌స్టేషన్ల ఏఈలు పాల్గొంటారని పేర్కొన్నారు.